# ఇదేనా ధర్మం ....?

రచయిత:
సి. చంద్రశేఖరం.

జోగయ్య మంచి పలుకుబడిగల గొప్ప స్థితిమంతుడు. అతనికుమార్తె విమలకు చిన్నతనంలోనే; తన నియమంప్రకారము పెళ్ళిచేశాడు. కానీ; ఆమెకు భర్తసేవ లభ్యంకాలేదు. అకాలమృత్యువుకు ఆహుతి అయ్యాడు ఆమె భర్త....

జోగయ్య మేనల్లుడు శివరామయ్య తన మేనమామగారి వూళ్ళోనే—కొన్నిరోజులు చదివాడు. అప్పుడే; విమలకూ శివరామయ్యకు కొంచెము ప్రణయసంభంద మేర్పడింది. తరువాత పెద్ద చదువు చదవటానికి; శివరామయ్య మదనపల్లెకు వెళ్ళాడు. ఇట్లా ఓ సంవత్సరంగడిచింది. సెలవలకు మేనమామ వూరువచ్చాడు. విమల యవ్వనంలో నిగనిగలాడుతూ వుంది. విమలలో చాలామార్పు గుర్తించాడు. మన శివరామయ్య. అయితే; మునుపటిలాగు విమల తనతో అంత చనువుగా మాట్లాటంలేదు. ఎందుకో?...

ఆనాడు జోగయ్య యేదో తొందర పనిమీద ప్రక్కగ్రామానికి వెళ్ళాడు. జోగయ్యభార్య పొలంలోకి వెళ్లినది. ఇంట్లో—శివరామయ్య—విమల ఇద్దరే వున్నారు. విమల వంటచేస్తూవుంది. శివరామయ్య వంటయింట్లోకి వెళ్లాడు. "విమలా!" అన్నాడు. ఆమె కంగారుపడి—"ఏం" అన్నట్లు వెనుతిరిగింది. అతను అక్కడున్న పీటమీద కూర్చున్నాడు. "విమలా! నాతో మాట్లాడటమే బొత్తిగా మానేశావే? ఈ సెలవలకు నీతో కులాసాగా గడుపుదామనివస్తే,...నీవు నాతో మాట్లాడకపోతే- ఇక నాకిక్కడింకేంపని? నేను వెళ్లిపోతా. నేను ఇక్కడ చదివేరోజుల్లో—మనం ఎంత చనువుగా వుండేవాళ్ళం!"

"బావా! నేను చాలా పాపాత్మురాలని.మా తండ్రి ఆజ్ఞ అటువంటిది. నేను ఎవ్వరితోటి మాట్లాడకూడదట. నీవులేని ఈ సంవత్సరము; ఒక యుగంలా తోచింది. నీ దర్శనభాగ్యం ఎప్పుడు లభిస్తుందా? అని. నాలో నేను బాధపడేదాన్ని. తీరా నువ్వు వచ్చాక నీతో మాట్లాడకూడదని; మా నాన్నగారు శాసించారు, ఏం చేయను బావా!"

"అయితే మీ నాన్నగారికి తెలియకుండా.... ఏం!"

"ఆమె మాట్లాడలేదు. చిరునవ్వు నవ్వింది." ఇద్దరూ. నవ్వుకున్నారు.

ఆనాటిరాత్రి 12 గంటలు టంగ్ ....టంగ్ ....మని కొట్టాయి. శివరామయ్యకు కంటిమీదరెప్పవాలలేదు. అక్కడ విమల ఎట్లావుందో! శివరామయ్య తిన్నగా లేచాడు. విమల గదివైపు వెళ్ళాడు. విమల పక్కవద్దకు వెళ్లిచూచాడు. ఆమె మేల్కొనేవుంది. ఆమె చెవిలో ఏదో వూదాడు. ఆమె లేచింది. తిన్నగా యిద్దరూ; తోటవైపు బయలుదేరారు. ఒకరికొకరు దగ్గరగా కూర్చున్నారు. "విమలా! ఈ సంవత్సరము నా చదువు పూర్తి అవుతూనే;—నిన్ను పెళ్ళాడుతాను. ఈ సంఘానికి భయపడేవాణ్ని కాను. మీ నాన్నగార్ని ఎలాఅయినా వప్పిస్తాను. తరువాత మా తలిదండ్రులను ఒప్పించడ మేమంత గొప్ప పనికాదు."

పాపం! అమాయకురాలు. శివరామయ్య మాటలు నమ్మింది. ఆమాటలకు వుప్పొంగిపోయింది. వెన్నలా కరగిపోయింది...ఆశాపూరిత నయనాల్తో అతనివైపు చూచింది.... ..

అతడు ఆమెను దగ్గరగా తీసుకున్నాడు.

ఆమె అతని హృదయంమీద వాలిపోయింది.

ఐదు నిమిషాలు గడిచాయి. ఆమె ముంగురులు రేగిపోయాయి......ఇద్దరూ; నిశ్శబ్దంగా యింట్లో ప్రవేశించారు........

నెలరోజులు గడిచాయి. విమలలో కొన్ని మార్పులు కన్పించాయి. శివరామయ్యకు సెలవలు ఆయిపోవడంవల్ల మదనపల్లెకు వెళ్లిపోయాడు.

* * *

కాలచక్రం తనపని తాను నెరవేరుస్తూవుంది. నాలుగునెలలు గడిచాయి. విమలకు కడుపుకొంచెము పెద్దదైంది. ఇక రహస్యం దాగేటట్లులేదు. వూళ్ళో అమ్మలక్కలు; బావులవద్ద; చెరువులవద్ద; విమలసంగతి చెప్పుకుంటూ నోళ్లు నొక్కుకోటం ప్రారంభించారు. విమల చాలా భయపడింది. తన తండ్రికి తెలిస్తే; ఇంకేమైనావుందా? శివరామయ్యకు వుత్తరం వ్రాసింది. "ఇక్కడ నేను నాల్గునెలల గర్భంతో వున్నాను. వూళ్లో ఎక్కడచూచినా నా విషయమే!—మా తండ్రికి తెలిస్తే, నన్ను బ్రతుకనివ్వడు. అందుకు నీవు నాతో చెప్పిన ప్రకారము; నీ మాటను నిల్పుకొని; నన్ను రక్షిస్తావని నమ్ముచున్నాను. నీవువచ్చి నన్ను రక్షించకపోతే; నాకు

మరణమే శరణ్యము. త్వరలో వుత్తరం వ్రాయి'' అని బావకు వుత్తరం వ్రాసింది.

శివరామయ్యలాంటి స్వార్థపరులకు; విమల లాంటి అభాగినులు జ్ఞాపకముంటారా?...వుత్తరం సకాలానికే శివరామయ్యకు అందింది. వుత్తరంచదివి ఆదోలా అయిపోయాడు.

జోగయ్య నిప్పులు గ్రక్కుతూన్నాడు. కారణం? జోగయ్య యేదో పంచాయతీ తీర్పు చేస్తుంటే—అందులో ఒకడు....''నీ కూతురు గర్భందాల్చి వుంటే;—ఆమెకు శిక్ష విధించలేక ఇక్కడ మహా తీర్పు చేయడానికి వచ్చావు'' అన్నాడు. అదే కారణం. జోగయ్య కోపానికి—యింటికి బయలు దేరాడు. విమల వంటచేస్తూవుంది.

ఒక్క అడుగులో వంటయింట్లోని ప్రవేశించాడు. ''విమలా!'' అని గర్జించాడు. ఆ కంఠం వినేటప్పటికి—విమల దిగ్గున లేచింది. జోగయ్య క్రిందనుంచి, మీదకు ఎగాదిగా చూచాడు. అతని కోపాగ్నికి అంతే లేకపోయింది.

ఇంతలో పోస్టుప్యూను ఓ కవరు యిచ్చాడు. కవరుచించి యిలా చదవటం మొదలెట్టాడు.

విమలకు,

మీ బావ శివరామయ్య వ్రాయడం. నీవుత్తరం చేరింది. సంగతులు తెలిశాయి. కానీ; నేను నిన్ను పెళ్లిచేసుకునే స్థితిలో లేను. ఈ పెళ్లికీ మాతల్లిదండ్రులు యేమాత్రమూ ఒప్పుకోలేరు. అప్పుడేమో, పెళ్లి చేసుకుంటానని చెప్పాను. ఇప్పుడు నీవు గర్భం దాల్చావు. అందుచేత నేను నిన్ను పెళ్లాడితే,........ సంఘం నన్ను బహిష్కరిస్తుంది. లోకులు నన్ను మల్కనగా చూస్తారు. అందుచేత నా మీద ఎలాంటి నిందా పెట్టవద్దు. నీ కర్మ నీవు అనుభవించాల్సిందే!

ఇట్లు, మీ బావ, శివరామయ్య.

ఉత్తరం చదివిన జోగయ్య కోపంతో విమల జుట్టుపట్టుకొని—చేతిలోని కర్రతో వీపు చిదుకగొట్టాడు. అది చాలక...''ఛీ! పాడుముండా! నా వంశానికి తీరని కళంకము తెచ్చిపెట్టావే ఛీ!!!



తక్షణం నా యింట్లోనుండి వెళ్లిపో!! ఒక్క క్షణమైనా నాయింట్లో వుంటానికి వీల్లేదు. నీ ప్రియుని వద్దకు వెళ్లు'' అని ఆమెను యింట్లోనుంచి గెంటాడు. ఆ త్రోపుకు ఆమె వీధిలో పడింది.

అప్పుడే సాయంకాలము 7 గంటలైయింది. విమల తిన్నగా బయలుదేరింది. ఎక్కడికో! అలా ఎంతదూరం వెడుతుందో!! పాపం!!! ...

విద్యార్థినులైన నేటి యువకులే సంఘానికి వెరచి—ఇలాంటి అభాగినులను అధోగతిపాలు చేస్తున్నారు. నమ్మించి మోసం చేస్తున్నారు. ఇదేనా ధర్మం?........

ఒకవైపు బావవ్రాసిన వుత్తరం! ఇంకోవైపు తండ్రి అన్న మాటలు!! ఇవి తల్చుకుంటూవుంటే; — ఆమె హృదయం దహించుకుపోతూవుంది. తాను మనసారా పరిణయమాడిన తన ప్రియునకు—ప్రేమరసం—అనురాగంతో అందించింది. అతను స్వీకరించాడు. తను గర్భం దాల్చింది. ''నిన్ను పెళ్ళాడుతాను'' అని నమ్మించిన తన ప్రియుడు సంఘానికి వెరచి—తనకు ద్రోహంచేశాడు. తన తండ్రి యింటినుండి గెంటేశాడు. ఇక సంఘం ఆమెను బ్రతుకనిస్తుందా? కల్ల....!

''నాలాంటి అభాగినులు; ఈ పాడు సంఘం కన్నుల ఎదుట వుండరాదు. నా ప్రియుడే నాకు ద్రోహంచేశాక—ఇక ఈ లోకంతో నాకు పనిలేదు'' అని ఆమె అనుకుంటూ; చరచరా నది వైపు నడచివెళ్లింది. ఒక్కక్షణంలో ఆమె పవిత్ర నదీమతల్లి గర్భంలో ఐక్యమైపోయింది. ప్రశాంతంగా ప్రవహిస్తున్న నదిలో కొంచెము కదలికయేర్పడి.... మళ్లీ మామూలుగా ప్రవహిస్తూంది. ఇలాంటి అభాగినులు ఎంతమంది పవిత్ర నదీమతల్లి గర్భంలో ఐక్యమయ్యారో! ఇంకా ఎంతమంది కావాలో!! ఆకాశంలో చుక్కలు మినుకు—మినుకు మంటున్నాయ్! అందులో రెండు చుక్కలు క్రిందకు జారిపోయాయి...............